సాక్షి నిజామాబాద్



సోమవారం ; 20 ; అక్టోబర్ ; 2025



దీపెంతలు, బొమ్మలు కొనుగోలు చేస్తున్న మహిళలు



లక్ష్మీదేవి చిత్రపటాలు..



నగరంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో టపాకాయల దుకాణాలు

కోటి వెలుగుల దీపావళి

దీపావళి వేడుకల నేపథ్యంలో జిల్లా అంతటా సందడి నెలకొంది. రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో వ్యాపార సముదాయాలు, భారీ భవనాలు ధగధగలాడుతున్నాయి. పండుగను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. జిల్లా కేంద్రంతోపాటు ఆయా పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో పటాకుల దుకాణాలు వెలిశాయి. పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్ కళకళలాడింది. కోటి వెలుగుల దీపావళి అందరి జీవితాల్లోకి సరికొత్త విజయాలను తీసుకురావాలని ఆకాంక్షిద్దాం. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు



నిజామాబాద్ అర్బన్: దీపావళి పండగను పురస్కరించుకొని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి జీవితాల్లో కష్టాల కారుచీకట్లు తొలగిపోయి, చిరుదివ్వెల వెలుగుల మాదిరి అనునిత్యం సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ఇంటిల్లిపాది ఆనందంగా దీపావళి వేడుకలను జరుపుకోవాలని అభిలషించారు.

వైన్ షాపులకు దరఖాస్తు గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్ : వైన్‌షాపులకు నూతన లైసెన్సుల కేటాయింపు కోసం దరఖాస్తు గడువును పెంచినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీతో గడువు ముగిసినప్పటికీ ఆ రోజున బీసీ బంద్ కారణంగా చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయారని, దీనిని దృష్టిలో ఉంచుకుని 23వ తేదీ వరకు గడువును పొడించామని పేర్కొన్నారు. 27వ తేదీన భారతీగార్డెన్‌లో ఉదయం 11 గంటలకు లక్కీ డ్రా తీస్తామని తెలిపారు. 18వ తేదీ నాటికి మొత్తం 2633 దరఖాస్తులు అందగా, నిజామాబాద్ స్టేషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 908, బోధన్ 427, ఆర్మూర్ 572, భీమ్‌గల్ 355, మోర్తాడ్ స్టేషన్ పరిధిలో 366 దరఖాస్తులు అందాయని వివరించారు.

23న ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపికలు

నిజామాబాద్ నాగారం : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డిగ్రీ కాలేజ్ గ్రౌండ్‌లో ఈనెల 23న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సీనియర్ మెన్ అండ్ ఉమెన్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు అదేరోజు గురువారం ఉదయం 9గంటలలోపు తమ సర్టిఫికెట్లు, జిరాక్స్‌లతో పాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకొని ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగేశ్వరరావుకి రిపోర్ట్ చేయాలన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిచనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు క్రీడాకారులకు ఈనెల 25 నుంచి నవంబర్ 5 వరకు పిట్లంలో శిక్షణ శిబిరం నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 85559 96271, 94942 59901, 96762 69988 ను సంప్రదించాలన్నారు.

ఎస్సారెస్పీలోకి స్వల్పంగా పెరిగిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. క్రితం రోజు 5,654 క్యూసెక్కులు వచ్చిన వరద ఆదివారం 9,654 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 3 వేల క్యూసెక్కుల నీటి విడుదల ప్రారంభించారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 650, లక్ష్మి కాలువ ద్వారా 200, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 573 క్యూసెక్కులు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి అంతేస్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉందని అధికారులు పేర్కొన్నారు.

ఒక్కో సర్వే నంబర్‌కు ఒక్కో ధర

నేషనల్ హైవే 63 విస్తరణ..

- భూములు నష్టపోతున్న రైతులకు పరిహారంలో తేడాలు
- ఒక ఎకరానికి రూ.1.14 కోట్లు.. పక్కనే ఉన్న మరో ఎకరానికి రూ.10.91 లక్షలు..
- నిర్దిష్టమైన విధానం కరువు
- అధికారుల తీరుపై రైతుల నిరసన



విస్తరణ చేపట్టనున్న జాతీయ రహదారి 63 ఇదే..

మోర్తాడ్(బాల్కొండ): ఆర్మూర్ నుంచి కమ్మర్‌పల్లి శివారు వరకు నేషనల్ హైవే 63 విస్తరణ, అవసరం ఉన్న చోట్ల బైపాస్ రోడ్ల నిర్మాణానికి జిల్లాలో 83.895 హెక్టార్ల భూమి అవసరం ఉంటుందని అధికారులు గుర్తించారు. అయితే భూ సేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేసిన అధికారులు ఒక్కో సర్వే నంబర్ భూమికి ఒక్కో ధర నిర్ణయించారు. దొన్కల్ రెవెన్యూ శివార్లలోని 502/1ఎఫ్‌బీ సర్వే నంబర్‌లో ఎకరానికి రూ.1,14,31,384 ధరను, దాని పక్కనే ఉన్న 500/3 సర్వే నంబర్‌లోని భూమికి రూ.60,54,604 ధరను అవార్డుగా ప్రకటించారు. ఇదే వరుసలో ఉన్న 377/2ఏ సర్వే నంబర్‌కు మాత్రం రూ.10,91,240 పరిహారంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అలాగే జాతీయ రహదారికి మరో వైపున ఉన్న 508/1సీ/1/2 సర్వే నంబర్ భూమికి రూ.60,54,600 పరిహారాన్ని నిర్ణయించారు. ఇదే వరుసలో ఉన్న 534/1ఏ/2 సర్వే నంబర్‌లోని భూమికి రూ.10,91,240 చొప్పున చెల్లిస్తామంటున్నారు. ఈ నిర్ణయంపై రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తాము నష్టపోతున్న భూమికి ఒకే విధమైన పరిహారాన్ని చెల్లిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదని అంటున్నారు. అయితే పరిహారం నిర్ణయించడంలో అధికారుల తీరు అనేక అనుమానాలకు తావిస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు.



భూములు కోల్పోతున్న దొన్కల్ గ్రామ రైతులు

కమ్మర్‌పల్లిలో ఒకలా..

జగిత్యాల్ జిల్లా సరిహద్దులో ఉన్న గండిహనుమాన్ మందిరం నుంచి కమ్మర్‌పల్లి శివారులోని పాటి హనుమాన్ మందిరం వరకు జాతీయ రహదారిని విస్తరించేందుకు ఇరువైపులా భూమిని సేకరిస్తున్నారు. ఇక్కడ ఒక్కో ఎకరానికి రూ.కోటికి తగ్గకుండా పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. దొన్కల్ వద్ద 40 ఎకరాల భూమిని రహదారికి ఇరువైపులా రైతులు నష్టపోతుండగా.. ఆ భూమి అంతా ఒకే వరుస క్రమంలో ఉందని, అలాంటప్పుడు పరిహారం ఒకేలా ఉండాలని రైతులు అంటున్నారు. పరిహారం చెల్లింపులో స్వల్ప తేడా ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదని, 90 శాతానికి మించి తేడా ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. అన్ని భూములకు ఒకే విధంగా పరిహారం చెల్లించకుంటే భూములు ఇచ్చేది లేదంటున్నారు.

నష్టాన్ని ఎవరూ పూడ్చలేరు



భూమి నష్టపోయే రైతు నష్టాన్ని ఎవరూ పూడ్చలేరు. పరిహారం నిర్ణయించే విషయంలో అధికారులు అసమానతలు ఎందుకు చూపారో అర్థం కావడం లేదు. వివక్ష సరికాదు.

– సింగిరెడ్డి గంగారెడ్డి, రైతు, దొన్కల్

ప్రభుత్వం స్పందించాలి



భూమిని నష్టపోతున్న రైతులకు పరిహారం చెల్లించే విషయంలో ప్రభుత్వం స్పందించాలి. లేకుండా పోరాటం చేస్తాం. ఎంతో విలువైన భూములను కోల్పోతున్నాం.

– ఏనుగు కిరణ్, రైతు, దొన్కల్

పోలీసుల అదుపులో రియాజ్

- సారంగాపూర్ ప్రాంతంలో పట్టుకున్న ప్రత్యేక బృందాలు
- అడ్డుకున్న స్థానిక యువకుడిపై కత్తితో దాడి చేసిన నిందితుడు
- వదంతులు నమ్మొద్దు : సీపీ సాయి చైతన్య

నిజామాబాద్‌అర్బన్ : రాష్ట్రంలో సంచలనం సృష్టించిన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులో నిందితుడైన పాతనేరస్తుడు రియాజ్ పోలీసులకు ఆదివారం చిక్కాడు. బైక్ చోరీ కేసులో శుక్రవారం రాత్రి అరెస్టు చేసి తీసుకొస్తుండగా కత్తితో దాడి చేసి కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసి పరారయ్యాడు. నిందితుడిని పట్టుకునేందుకు సీపీ సాయిచైతన్య ఎనిమిది బృందాలను రంగంలోకి దింపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు సారంగాపూర్ ప్రాంతంలో ఓ లారీ విడిభాగమైన క్యాబిన్‌లో రియాజ్ దాక్కున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ప్రత్యేక బృందాలు బైకులపై అక్కడికి చేరుకోగానే గమనించిన రియాజ్ పారిపోతుండగా పోలీసులు వెంబడించారు. అదే సమయంలో రియాజ్‌ను పట్టుకునేందుకు ఆసిఫ్ అనే యువకుడు ప్రయత్నించగా అతడిపై గాజు ముక్కతో దాడి చేశాడు. అప్పటికే పోలీస్ బృందాలు రియాజ్‌ను చుట్టుముట్టాయి. నిందితుడిని పట్టుకునే క్రమంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

భద్రత నడుమ ఆస్పత్రికి..



నిందితుడు రియాజ్

నిందితుడు రియాజ్‌కు దెబ్బలు తగలడంతో ప్రభుత్వ ఆస్పత్రిలోని ఖైదీలకు వైద్యం అందించే వార్డులో ఉంచారు. మొదట ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ప్రాథమిక చికిత్స చేశారు. ప్రస్తుతం రియాజ్ ఆరోగ్యంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. నిందితుడిని పట్టుకునే ప్రయత్నంలో గాయాలపాలైన ఆసిఫ్‌ను పోలీసులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆసిఫ్ పరిస్థితి నిలకడగా ఉంది.

ఎన్‌కౌంటర్ వదంతులు

రియాజ్‌ను సారంగాపూర్ ప్రాంతంలో పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారని ఆదివారం మధ్యాహ్నం వదంతులు వ్యాపించాయి. అయితే రియాజ్ తమ అదుపులోనే ఉన్నాడని, ఎన్‌కౌంటర్ చేయలేదని సీపీ సాయి చైతన్య ప్రకటన విడుదల చేయడంతో వదంతులకు ఫుల్‌స్టాప్ పడింది.

వీడియో వైరల్

రియాజ్‌ను అదుపులోకి తీసుకున్న సమయంలో అదే ప్రాంతంలో ఒకరు తీసిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. నిందితుడి వద్ద కత్తి ఉందనే అనుమానంతో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అదుపులోకి తీసుకున్నారు. తుపాకులతో గురిపెట్టి నేలపై పడుకోబెట్టి, అనంతరం బేడీలు వేసి, తాళ్లతో కట్టేసి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తీవ్రంగా గాలించిన ప్రత్యేక బృందాలు

శుక్రవారం రాత్రి నుంచి 8 ప్రత్యేక బృందాలు రియాజ్ కోసం తీవ్రంగా గాలించాయి. నిందితుడు మొదట జిల్లా దాటినట్లు భావించినప్పటికీ సరిహద్దు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం నగరంలోనే ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. రియాజ్ పాతనేరస్తుడు కావడంతో అతడు తరచూ తిరిగే ప్రాంతాలు, కలిసే వ్యక్తులపై పోలీసులు నిఘా సారించి ఫోన్ నంబర్‌ను ట్రేసింగ్‌లో పెట్టారు. కానీ రియాజ్ ఫోన్ ఉపయోగించకుండా చోరీ చేసిన బైకుతో పోలీసుల కన్నుగప్పి వివిధ ప్రాంతాలు తిరిగాడు. బర్కత్‌పురాలోని ఓ లాయర్ వద్దకు వెళ్లిన రియాజ్ అతడి ద్వారా లొంగిపోయేందుకు ప్రయత్నించినప్పటికీ సదరు లాయర్ సాయం చేసేందుకు నిరాకరించినట్లు సమాచారం.

శనివారం రాత్రి చిక్కినట్టే చిక్కి..

రియాజ్ శనివారం రాత్రి పోలీసులకు చిక్కినట్టే చిక్కి తప్పించుకున్నాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో బర్కత్‌పురాలో బైక్‌పై తిరుగుతున్న నిందితుడిని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసుల సూచనతో ఇద్దరు యువకులు రియాజ్‌ను అనుసరించారు. బర్కత్‌పుర నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు, అనంతరం బస్టాండ్ వెనుక వైపు నుంచి మార్కెట్ యార్డు, అర్సపల్లి మీదుగా మళ్లీ సారంగాపూర్‌కు చేరుకున్నాడు. సారంగాపూర్ వద్దకు రాగానే తనను అనుసరిస్తున్న యువకులను గమనించిన రియాజ్ కెనాల్ కట్ట వైపు వెళ్లాడు. అటు నుంచి నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్, మరో ఇద్దరు బైక్‌పై రియాజ్‌ను వెంబడించారు. పోలీసులను చూసిన రియాజ్ నిజాంసాగర్ కెనాల్ వైపు వేగంగా వెళ్లాడు. అనంతరం బైక్ పైనుంచి కాలువలో దూకి, అక్కడి నుంచి పరారయ్యాడు. అదే సమయంలో పోలీసులు రియాజ్‌పై రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. కానీ, కాలువలో దూకడంతో ఆచూకీ లభించలేదు. అదే ప్రాంతంలో ఆరు ప్రత్యేక బృందాలు తీవ్రంగా గాలించగా, చీకటి ఉండటంతో పోలీసులు గుర్తించలేకపోయారు.



రియాజ్‌ను చుట్టుముట్టిన పోలీసులు

సాలూర ఎత్తిపోతలకు పూర్వవైభవం

బోధన్ : మంజీర నదిపై సాలూర గ్రామ శివారులో నిర్మించిన ఎత్తిపోతల పథకం ఎట్టకేలకు పునః ప్రారంభమైంది. సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, డైరెక్టర్లు, కమిటీ సభ్యులతో కలిసి ఎత్తిపోతల పథకం నిర్వహణ కమిటీ చైర్మన్ శివకాంత్ పటేల్ ఆదివారం పథకం మోటార్లను ప్రారంభించి నీటిని విడుదల చేశారు. కమిటీ ప్రతినిధులు డిస్కో సాయిలు, ఇల్తెపు సాయన్న, గ్రామ పెద్దలు ఇల్తెపు శంకర్, గాండ్ల పెద్ద రాజేశ్వర్, కండెల సంజీవ్, ముట్టిన్ గంగారాం, కేజీ గంగారాం రైతులు పాల్గొన్నారు.

సామగ్రి చోరీతో మూతపడి..

ప్రతియేటా వర్షాకాలం ప్రారంభంలోనే మంజీర నదిలోకి నీటి ప్రవాహం ప్రారంభంకాగానే ఎత్తిపోతల పథకం మోటార్లను ప్రారంభించి ఎత్తిపోసిన నీటిని చెరువుల్లో నింపుకుని అవసరాల మేరకు పంటల సాగుకు ఉపయోగించుకుంటారు, కానీ ప్రస్తుత సంవత్సరం ఎత్తిపోతల పథకం ప్రధాన పంప్‌హౌజ్‌లో ఎలక్ట్రికల్ ప్యానెల్ బోర్డు, ఇతర సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. దీంతో నిర్వహణ కమిటీ వద్ద నిధులు లేక మరమ్మతులు చేపట్టకపోవడంతో పథకం నిరుపయోగంగా మారింది. రెండు నెలల క్రితం పథకం పునః ప్రారంభించేందుకు గ్రామ ప్రజాప్రతినిధులు, ఆయకట్టు రైతులు సమావేశమై చర్చించారు. నూతన కమిటీని ఎన్నుకొని, మరమ్మతుల ఖర్చును అంచనా వేశారు. సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, పలువురు రైతులు ఆర్థిక సహకారం అందించడంతో మరమ్మతులు చేపట్టారు. పథకం పునః ప్రారంభంతో పంటల సాగుకు భరోసా ఏర్పడిందని రైతులు పేర్కొంటున్నారు.



మోటర్లను ప్రారంభిస్తున్న ఎత్తిపోతల పథకం కమిటీ చైర్మన్ శివకాంత్ పటేల్ తదితరులు

పన్ను చెల్లించి సహకరించాలి

రైతులు చెల్లించాల్సిన పన్ను బకాయిలు సకాలంలో చెల్లించి సహకరించాలి. ఎత్తిపోతల పథకం ద్వారా పంటల సాగుకు నీరందించేందుకు ప్రయత్నాలు చేశాం. నిరంతరాయంగా ఎత్తిపోతల పథకం నిర్వహణకు ఆర్థిక వనరులు సమకూర్చుకుంటేనే సాధ్యమవుతుంది.

– శివకాంత్ పటేల్, ఎత్తిపోతల పథకం నిర్వహణ కమిటీ చైర్మన్

కొండంత అవినీతి.. గోరంత రికవరీ

అక్రమార్కులకే 'ఉపాధి'

- ఐదేళ్లలో జిల్లాలో రూ.6.57 కోట్ల అవినీతి
- సామాజిక తనిఖీల్లో వెలుగు చూస్తున్న అక్రమాలు
- రికవరీ చేయడంలో అధికారుల నిర్లక్ష్యం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగానే ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) అక్రమార్కులకు వరంగా మారింది. ఫీల్డ్ అసిస్టెంట్ మొదలుకొని మండల అధికారుల వరకు అందినకాడికి దండుకుంటున్నారు. ఉపాధి పనుల్లో అక్రమాలను గుర్తిస్తున్న ఉన్నతాధికారులు అవినీతి సొమ్మును తిరిగి రాబట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా అవినీతి కొండలా పెరిగిపోతోంది.

ఏటా లక్షల్లో అవినీతి..

ప్రతి ఏడాది ఉపాధి సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో పర్యటించి ఆ ఏడాది కాలంలో చేపట్టిన పనులను పరిశీలిస్తాయి. గ్రామసభల్లోనే అక్రమాలను వెల్లడిస్తారు. అలాగే మండలస్థాయిలో నిర్వహించే సామాజిక తనిఖీ ప్రజావేదికలో గ్రామాల వారీగా జరిగిన అవినీతిని వెల్లడిస్తూ నివేదికను జిల్లా ఉపాధిహామీ అధికారులకు అందిస్తారు. అయితే అవినీతి సొమ్ము రికవరీ మాత్రం జరగడం లేదు. గత ఐదేళ్లలో రూ.6,57,08404 (రూ.6.57 కోట్లు) అవినీతి జరగగా, ఇంతవరకు కేవలం రూ.14,64,450 (రూ.14.64లక్షలు) సొమ్ము మాత్రమే రికవరీ చేయడం గమనార్హం.

గత ఐదేళ్లలో 471 మంది అధికారులకు రూ.33.61 లక్షల జరిమానా విధించారు. అవినీతి సొమ్ము రికవరీ కోసం అయితే రెవెన్యూ రికవరీ యాక్ట్‌ను ప్రయోగించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతి ఏడాది రూ.లక్షల్లో అవినీతి..

చేయని పనులను చేసినట్లు చూయించి బిల్లులు డ్రా చేయడం, కూలీల హాజరులో అక్రమాలు ఇలా గ్రామ స్థాయిలో చాలామంది ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడుతున్నారు. అయితే సామాజిక తనిఖీ బృందాలు ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు అందించిన తర్వాత వారు పునఃపరిశీలించి అవినీతి సొమ్ము మొత్తాన్ని అమాంతం తగ్గించేస్తున్నారనే ఆరోపణలున్నాయి. నిజామాబాద్ డివిజన్‌లోని డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి మండలాల్లో ఉపాధి అక్రమాలపై సహ చట్టం ద్వారా వివరాలు అడిగినా అధికారులు ఇవ్వడం లేదు. జక్రాన్‌పల్లి మండలంలో లేబర్ పేమెంట్స్‌లో పనికి రాని వారికి, గ్రామంలో లేనివారికి సొమ్ము జమచేస్తూ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారు. ఇలా ప్రతి ఏడాది రూ.లక్షల్లో అవినీతి జరుగుతున్నా అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

గత ఐదేళ్లలో జిల్లాలో ఉపాధిహామీ పనుల్లో గుర్తించిన అక్రమాలు..

ఆర్థిక సంవత్సరం	గుర్తించిన అవినీతి (రూ.లలో)	రికవరీ (రూ.లలో)	జరిమానా పడిన అధికారులు	జరిమానా/రికవరీ (రూ.లలో)
2020-21	4558373.00	351079.00	63	406078.00
2021-22	14635271.00	378604.00	108	436632.00
2022-23	21143839.00	461534.00	240	1121527.00
2023-24	14617319.00	54785.00	41	189188.00
2024-25	10753602.00	218448.00	19	1207805.00
మొత్తం	65708404.00	1464450.00	471	3361230.00



మోపాల్ మండలంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న డీఆర్‌డీవో సాయాగౌడ్, అధికారులు (ఫైల్)



రెండు రోజుల్లో పేకాడుతున్న 81 మంది అరెస్ట్

- రూ. 85వేలు నగదు స్వాధీనం
- ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా గడిచిన రెండు రోజుల్లో చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో పేకాడుతున్న 81 మందిని అరెస్ట్ చేశామని ఎస్పీ రాజేశ్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. వారి వద్ద నుంచి రూ.85వేల నగదు, 41 సెల్‌ఫోన్‌లు, 9 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. పేకాడిన వారిపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు చేశామన్నారు. పేకాట, చట్ట వ్యతిరేక కార్యకలపాలను సహించేది లేదన్నారు. దీపావళి నేపథ్యంలో పేకాటపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా పేకాడితే పోలీస్ కంట్రోల్ రూం నెంబర్ 87126 86133కు గానీ, డయల్ 100కు గానీ ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

బట్టాపూర్‌లో..

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల పోలీసు స్టేషన్ పరిధిలోని బట్టాపూర్‌లో ఒక ఇంట్లో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రాజేశ్వర్ ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,01,280 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఐదు సెల్‌ఫోన్లు, 3 బైక్‌లను సైతం స్వాధీనం చేసుకున్నామన్నారు.

























ఫలించిన ప్రయత్నాలు

- జోర్డాన్ నుంచి స్వదేశానికి రానున్న వలస కార్మికులు
- రాష్ట్రానికి చెందిన 12 మంది ఈనెల 25లోగా ఇంటికి చేరుకునే అవకాశం
- అధికార, ప్రతిపక్ష నేతల కృషితో వేగంగా స్పందించిన విదేశాంగ శాఖ
- ఊపిరి పీల్చుకుంటున్న బాధిత కుటుంబాలు



జోర్డాన్ దేశంలో చిక్కుకున్న తెలంగాణ వలస కార్మికులు

మోర్తాడ్(బాల్కొండ): అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు, అధికారుల ప్రయత్నాలు ఫలించాయి. ఉపాధి కోసం జోర్డాన్ వెళ్లి ఇబ్బందిపడుతున్న వలస కార్మికులు స్వదేశానికి వచ్చేందుకు మార్గం సుగమమైంది. ఈ నెల 25వ తేదీలోగా రాష్ట్రానికి చెందిన 12 మంది ఇంటికి చేరనున్నారు. వివరాలు ఇలా.. ఏడాది క్రితం జోర్డాన్‌లోని వ్యవసాయ క్షేత్రాల్లో పని చేసేందుకు తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు వెళ్లారు. ఇందులో మన రాష్ట్రానికి చెందిన 12 మంది వలస కార్మికులు వారి గోడును వెళ్లబోసుకున్నారు. జోర్డాన్‌లో తాము పడుతున్న కష్టాలపై వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి, మాజీ మంత్రి హరీశ్‌రావుకు లేఖ రాశారు. మదద్ పోర్టల్‌లో కేసు నమోదు చేయించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు జీఏడీ ఎన్నారై విభాగం ఐఏఎస్ అధికారులు సయ్యద్ అలీ ముర్తుజా, శివలింగయ్యలతోపాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి విదేశాంగ శాఖ అధికారులతో మాట్లాడారు. జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లోని భారత రాయబార కార్యాలయం అధికారులు మిల్లీనియం అగ్రికల్చర్ ఇన్వెస్టిమెంట్స్ కంపెనీలో ఉపాధి పొందుతున్న వలస కార్మికుల వద్దకు వెళ్లారు. వారి వివరాలను నమోదు చేసుకొని జోర్డాన్ విదేశాంగ శాఖతో సంప్రదింపులు జరిపారు.

ఒప్పందం ఉల్లంఘించినందుకు జరిమానా..

రెండేళ్లపాటు మిల్లీనియం అగ్రికల్చర్ ఇన్వెస్టిమెంట్స్ కంపెనీలో పనిచేసేందుకు వలస కార్మికులు జోర్డాన్‌కు వెళ్లే ముందు ఒప్పంద పత్రం రాసి ఇచ్చారు. ఏడాదికి ముందుగానే ఇంటికి వచ్చేస్తుండటంతో ఒప్పందం ప్రకారం జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో కార్మికుడు కనీసం రూ.50వేల జరిమానాను కంపెనీకి చెల్లించాలి. కార్మికుల ఆర్థిక పరిస్థితి బాగులేకపోవడంతో మాజీ మంత్రి హరీశ్‌రావు ఆర్థిక సాయం చేయడంతో కంపెనీకి 12 మంది కార్మికుల తరఫున జరిమానా చెల్లించారు. సొంతంగానే విమాన టిక్కెట్‌ను కొనుగోలు చేసుకొని ఇంటికి రావాల్సి ఉండటంతో హరీశ్‌రావు స్వయంగా టిక్కెట్లను కొనుగోలు చేసి ఇస్తున్నారని సిద్దిపేట్ జిల్లా దుబ్బాకకు చెందిన పెంద్యాల మహేందర్ 'సాక్షి'తో చెప్పారు.

వలస కార్మికులపై ప్రత్యేక దృష్టి..



జోర్డాన్‌లోని వలస కార్మికుల విషయంలో విదేశాంగ శాఖ స్పందించిన తీరు బాగుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వలస కార్మికుల అంశంపై ప్రత్యేక దృష్టిని సారించాం. వలస కార్మికుల అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా మానవీయ కోణంలోనే చూడాలి. జోర్డాన్ నుంచి వలస కార్మికులు త్వరలోనే ఇళ్లకు చేరుకోనున్నారు.

– డాక్టర్ వినోద్‌కుమార్, మాజీ రాయబారి, ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్



నగరంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో వెలిసిన టపాసుల దుకాణాలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న లక్ష్మీదేవి ప్రతిమలు

నగరంలో దీపావళి సందడి

నిజామాబాద్ నగర మార్కెట్‌లో దీపావళి సందడి నెలకొంది. జిల్లా ప్రజలు పండుగకు ఒకరోజు ముందుగానే ఆదివారం సామగ్రి కోసం తరలిరావడంతో నగరమంతా కిటకిటలాడింది. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో, రోడ్ల పక్కన ప్రమిదలు, పూలు, పండ్లు, పూజా సామగ్రి, టపాసుల దుకాణాలను వ్యాపారులు పోటాపోటీగా ఏర్పాటు చేశారు. దీపావళి నేపథ్యంలో లక్ష్మీపూజకు కావాల్సిన అమ్మవారి చిత్రపటాలతోపాటు మట్టి ప్రతిమలు సైతం అందుబాటులో ఉన్నాయి. అలాగే టపాసులు అమ్మేందుకు దుకాణాదారులు నగరంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. మిఠాయి దుకాణాల్లోనూ స్వీట్ల ఆర్డర్లు చాలానే వచ్చాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. దీంతో నగరంలో ఎక్కడ చూసిన పండుగ సామగ్రి కొనుగోళ్లతో దీపావళి శోభ సంతరించుకుంది.

–నిజామాబాద్ రూరల్/సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



వివిధ ఆకృతుల్లో తులసీ కోటలు, దీపెంతలు



నగరంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన అలంకరణ సామగ్రి దుకాణం



దీపెంతలను కొనుగోలు చేస్తున్న మహిళ



పండ్లను విక్రయిస్తున్న వ్యాపారులు



నగరంలో టపాసులను కొనుగోలు చేస్తున్న ప్రజలు



పూలను కొనుగోలు చేస్తున్న మహిళ

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. వివరాలు ఇలా.. తాడ్వాయికి చెందిన గాంధారి రమేష్ (40) ఈనెల 14న ఉదయం మొక్కజొన్న కొట్టడానికి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం అతడు ఇంటికి రాగా, కొద్దిసేపటికే మళ్లీ బయటకు వెళ్లాడు. రాత్రయినా అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మరుసటి రోజు తాడ్వాయి బస్టాండ్ దగ్గర అతడు కిందపడి ఉండటంతో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి నిజామాబాద్‌లోని ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 18న సాయంత్రం రమేష్ మృతిచెందాడు. మృతుడికి భార్య ముత్తవ్వ, కూతుర్లు కీర్తన, శృతి ఉన్నారు. మృతుడి భార్య ముత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

మోపాల్ మండలంలో మహిళ..

మోపాల్: మండలంలోని గుడి తండాలో శనివారం రాత్రి జరిగిన దాడి ఘటనలో ఓ మహిళ గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై సుస్మిత తెలిపిన వివరాలు ఇలా.. తండాకు చెందిన రుదవత్ నీలాబాయి (41), భర్త వామన్ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు వినోద్, తన భార్యతో కలిసి గ్రామంలోనే ఆటో నడుపుకుంటున్నాడు. ఇటీవల వారి కుటుంబంలో కలహాలు నెలకొనగా, శనివారం రాత్రి వామన్, వినోద్ మధ్య గొడవ జరిగింది. ఇద్దరిని నీలాబాయి సముదాయించే ప్రయత్నం చేయగా కోపోద్రిక్తుడైన వామన్ ఆమె తలపై కర్రతో కొట్టాడు. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. కుమారుడు వినోద్ ఫిర్యాదు మేరకు వామన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పలువురిపై కుక్కల దాడి

సిరికొండ: మండల కేంద్రంతోపాటు కొండూర్ గ్రామంలో ముగ్గురిపై కుక్కలు వేర్వేరుగా దాడి చేశాయి. మండల కేంద్రంలో ఇద్దరిపై, కొండూర్ గ్రామంలో అద్వైత్ అనే బాలుడిపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. స్థానికులు వెంటనే వారిని మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మండల కేంద్రంలో గేదెపై కూడా కుక్క దాడి చేసినట్లు తెలిసింది.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

సెమీస్‌కి చేరిన జిల్లా వాలీబాల్ జట్టు



నిజామాబాద్ నాగారం: మహబూబ్ నగర్ జిల్లాలో ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ కొనసాగుతోంది. పోటీల్లో నిజామాబాద్ జట్టు సెమీస్‌కు చేరినట్లు సమాచారం. ఈసందర్భంగా క్రీడాకారులకు జిల్లా క్రీడల కార్యదర్శి నాగమణి ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు.

'సాగర్' గేటు ఎత్తివేత



నిజాంసాగర్(జుక్కల్): ఎగువ ప్రాంతాల నుంచి 7,048 క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో ఆదివారం నిజాంసాగర్ ప్రాజెక్టు ఒక వరద గేటును ఎత్తారు. వరద గేటు ద్వారా 4,048 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలో వదులుతున్నామని ప్రాజెక్టు ఏఈ సాకేత్ తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీల)కు ప్రస్తుతం 1405 అడుగులు (17.8 టీఎంసీల) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.